సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింది ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

పద్మనాభం: ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో మంచి మార్కులు పొందవచ్చని ఎంఈవో పొన్నగంటి రమణ అన్నారు. మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి ప్రతి ఒక్కరి కెరీర్‌లో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, వెంకటాపురం సర్పంచ్ కర్రి రమణ, పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బీచ్ వద్ద ఏర్పాట్ల పర్యవేక్షణ



రుషికొండ బీచ్ వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మెరైన్ సీఐ శ్రీనివాసరావు

కొమ్మాది: మహా శివరాత్రిని పురస్కరించుకుని గురువారం ఉదయం వేలాదిమంది భక్తులు బీచ్ రోడ్డులోని ఐటీ జంక్షన్ బీచ్, రుషికొండ బీచ్, సాగర్‌నగర్ బీచ్‌లో స్నానాలు ఆచరించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఈ బీచ్‌ల ప్రాంతాల్లో మెరైన్ సీఐ వి.శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆరోజు భక్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని మెరైన్ పోలీసులు, లైఫ్ గార్డులకు సీఐ సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తగరపువలస: స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 21వ వార్షిక వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం బాబాకు ప్రత్యేకంగా క్షీరాభిషేకం, అర్చన, సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం మెయిన్‌రోడ్డుపై భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షిక వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో అనాథ పిల్లల కోసం నిర్వహిస్తున్న సుభాష్ చంద్రబోస్ ఆవశ్య విద్యాలయం వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్ష అభియాన్ అధికారి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని, వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



విద్యుత్ స్తంభం మారుస్తున్న సిబ్బంది


తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌ను ఆనుకుని ఇటీవల స్కూల్ బస్సు ఢీకొట్టిన సంఘటనలో వాలిన స్తంభాన్ని మంగళవారం సరిచేశారు. 'విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన స్కూల్ బస్సు' శీర్షికతో ఈ నెల 24న సాక్షిలో ప్రచురితమైన వార్తకు చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ బొట్టా రవి స్పందించారు. సిబ్బందితో ప్రత్యామ్నాయ స్తంభం ఏర్పాటు చేశారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో పేకాడుతున్న ఏడుగురిని మంగళవారం సాయంత్రం పోలీసులు అరెస్ట్ చేశారు. యంతకుమ్మరిపాలెం శివారు ప్రాంతంలో పేకాడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సీఐ బొడ్డేపల్లి సుధాకర్, సిబ్బందితో వెళ్లి నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద రూ.1,050 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యవేటకు ఇసుక గండం

భీమిలి తీరంలో మత్స్యవేటకు ఇసుక గండంగా మారుతోంది. ఇక్కడ గోస్తని నది సముద్రంలో కలిసే ప్రాంతం ద్వారా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి తిరిగి వస్తుంటారు. అయితే, నదిలో ఇసుక మేటలు వేయడం పెద్ద సమస్యగా మారుతోంది. ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి నెల వచ్చేసరికి ఇదే సమస్య ఎదురవడంతో గంగపుత్రులు ఇబ్బంది పడుతున్నారు. మినీ జెట్టీ నిర్మాణం ఎప్పుడా అని నిరీక్షిస్తున్నారు.



వెడల్పు తగ్గిన గోస్తని నది ప్రాంతం

• ప్రవాహం తగ్గి మూసుకుపోతున్న 'గోస్తని' • పడవలు తిరిగే వీల్లేక మత్స్యకారుల అవస్థలు

భీమునిపట్నం: భీమిలి తీరం మత్స్యకారుల చేపల వేటకు ఎంతో అనువుగా, సురక్షితంగా ఉంటుంది. సాధారణంగా తీరప్రాంతాల్లోని గ్రామాల్లో మత్స్యకారులు పడవలతో అలలమీద నుంచి లోపలికి వెళ్లి తిరిగి తీరానికి వస్తుంటారు. అలల ఉధృతి ఎక్కువ ఉంటే, ఆ తీవ్రతకు పడవలు బోల్తా పడే పరిస్థితులు ఉంటాయి. కానీ ఇక్కడ తీరంలో ఆ సమస్య ఉండకపోవడంతో వీరికి ఎంతో అనుకూలంగా ఉంటోంది. జిల్లాలోనే ఇది ఎంతో సురక్షితమైన తీరం. ఇక్కడ భీమిలికి చెందిన మత్స్యకారులే కాకుండా పక్కనే ఉన్న నాగమయ్యపాలెం, అన్నవరం ప్రాంతాలను చెందిన మత్స్యకారులు కూడా తమ పెద్ద మోటారు పడవలతో ఈ మార్గం ద్వారానే వేట సాగిస్తుంటారు. అదేకాకుండా ఇతర ప్రాంతాలకన్నా చాలా విశాలంగా ఉండటంతో పడవలను నిలుపుకోవడానికి వీలుగా ఉంటుంది. అలాగే చేపలను దించడం, వాటిని తరలించడంతో పాటు వలలు బాగు చేసుకోవడానికి కూడా సదుపాయంగా ఉంటుంది.

ఇసుకమేటలే పెద్ద సమస్య

పడవల రాకపోకలకు ఎంతో సదుపాయంగా ఉండే గోస్తని నదిలో ఇసుక మేటలు వేయడమే పెద్ద సమస్యగా మారుతోంది. వర్షాలు పడే సమయంలో గోస్తని నది ఎంతో విశాలంగా ఉండడంతో పాటు ప్రవాహం కూడా బాగుంటుంది. ఇది ఫిబ్రవరి నెల వరకు బాగానే ఉంటుంది. అక్కడి నుంచి ప్రవాహం తగ్గి, నదిలో ఇసుకమేట వేయడం మొదలవుంది. అలా కొద్దికొద్దిగా మేటలు వేస్తూ వస్తుంది. ఇలా వస్తున్న క్రమంలో నది వెడల్పుతో పాటు లోతు కూడా తగ్గుతుంది. దీంతో పడవల రాకపోకలకు కష్టమవుతుంది. కొద్ది రోజులకు మొత్తం మూసుకుపోవడంతో పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. ఇక అప్పటి నుంచి పెద్ద పడవలతో వేట సాగించడం కుదరదు. చిన్న పడవలు, తెప్పల ద్వారానే వేట సాగించాలి. నది ద్వారా వీలు కాకపోవడంతో నేరుగా సముద్రంలోకి వెళ్లి రావలసి వస్తుంది. ఇక్కడ తీరం ఒంపు తిరిగి ఉండడంతో అలల తీవ్రత ఎక్కువ. దీంతో సముద్రంలోకి వెళ్లి, తీరానికి వస్తున్న అనేక సందర్భాల్లో పడవలు, తెప్పలు బోల్తా పడుతున్నాయి. ఈ క్రమంలో పలువురు మత్స్యకారులు గాయపడుతుండగా, కొందరు చనిపోవడం కూడా జరుగుతోంది. పడవలు, వలలు, ఇంజిన్లు దెబ్బ తినడంతో వేలాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. అసలే చేపలు అంతంత మాత్రంగా దొరుకుతుండగా, దీనివల్ల మరింత నష్టపోవలసి వస్తుండడంతో గంగపుత్రులు చాలా బాధలు పడుతున్నారు.

మినీజెట్టీకి నిధులు కేటాయించినా..

మినీజెట్టీ నిర్మాణం జరిగితే ఈ సమస్య ఉండదని మత్స్యకారులు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. మత్స్యకారుల ఇబ్బందులను గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో మినీ జెట్టీ నిర్మాణానికి రూ.28 కోట్లు కేటాయించారు. ఇక్కడ గోస్తని సాగరసంగమ ప్రాంతానికి దగ్గరలో నిర్మాణం చేపట్టాలను అధికారులు నిర్ణయించారు. ఇందు కోసం స్థలాన్ని పరిశీలించడంతో పాటు అవసరమైన సన్నాహాలను మొదలు పెట్టాలనుకునే తరుణంలో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారిపోవడంతో, పనులు ప్రారంభం కాలేదు.



నది మూసుకుపోయిన తరువాత తీరం నుంచి నేరుగా సముద్రంలోకి వెళ్తున్న పడవ (ఫైల్)



ప్రస్తుతం నదిలోంచి తీరానికి వస్తున్న పడవ

ఇసుక మేటలతో తీవ్ర నష్టం



గోస్తని నదిలో ఇసుక మేటలు వేయడం వల్ల అందరం తీవ్రంగా నష్టపోవలసి వస్తోంది. నది ప్రవాహం ఉన్నప్పుడు ఎంతో బాగుండగా, మేటలు వేసిన తరువాత పడవలు తిరిగే అవకాశం ఉండడం లేదు. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి ఉండడం పెద్ద సమస్యగా మారింది.

– బుంగ సత్యరాజు, మత్స్యకారుడు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



ఇసుకమేటల వల్ల చేపల వేటకు నష్టం కలగకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో మంజూరైన మినీ జెట్టీ నిర్మాణాన్ని పూర్తి చేస్తే ఇసుక మేట సమస్యే ఉండదు. మత్స్యకారుల జీవనం సాఫీగా సాగుతుంది.

– వాసుపల్లి కొండబాబు, మత్స్యకారుల నాయకుడు, భీమిలి

ఇసుక తవ్విస్తున్నా..



నది మూసుకుపోవడంతో పొక్లెయిన్‌తో ఇసుకను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

ఇప్పటికే గోస్తని నదిలో ప్రవాహవేగం తగ్గిపోవడంతో మెల్లగా నది వెడల్పు తగ్గుతూ వస్తోంది. మరికొద్ది రోజుల్లో ఇసుకమేటలు వేయడం వల్ల నదిలో లోతు తగ్గిపోవడంతో పాటు పూర్తిగా మూసుకుపోతుంది. మత్స్యకారులు ఏటా పొక్లెయిన్ల ద్వారా ఇసుకను తవ్విస్తున్నా పెద్దగా ఉపయోగం ఉండడం లేదు. మినీ జెట్టీ నిర్మాణం జరిగితేనే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని మత్స్యకారులు నిరీక్షిస్తున్నారు.

వికసించిన బ్రహ్మకమలం



వికసించిన అరుదైన బ్రహ్మకమలం

భీమునిపట్నం: భీమిలిలో అరుదైన బ్రహ్మకమలం వికసించింది. ఇక్కడ ఆంధ్రాబాప్టిస్ట్ చర్చి దగ్గరలోని నెహ్రూ వీధిలో నివసిస్తున్న బాకి వెంకట రమణారెడ్డి, భాగ్యలక్ష్మి దంపతులు ఇంట్లో నాలుగేళ్లుగా ఈ బ్రహ్మకమలం మొక్కను పెంచుతున్నారు. సోమవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో మొగ్గ మెల్లగా విచ్చుకోవడం ప్రారంభమై, 11 గంటల ప్రాంతంలో పూర్తిగా విచ్చుకుని, కనువిందు చేసింది.

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ



తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు పట్టుచీర, జర్బెరా పువ్వులు, గజమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణకు మజ్జివలస కళ్లాలకు చెందిన పిన్నింటి అప్పారావు, లక్ష్మి దంపతులు సహాయ సహకారాలు అందించారు.

ఫెన్సింగ్ సబ్ జూనియర్ జిల్లా జట్టు ఎంపిక నేడు

మధురవాడ: ఏపీ 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలకు ఫెన్సింగ్ క్రీడల ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు ఎంపిక బుధవారం మధురవాడ కళానగర్ వద్ద గల ఏఆర్‌కే స్పోర్ట్స్ ఎరీనాలో జరుగుతుందని జిల్లా కార్యదర్శి ఎస్.పి.త్రినాథ్ తెలిపారు. మార్చి 1, 2 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా పొన్నవరంలో బాల, బాలికలకు ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలు జరగనున్నాయి. ఆ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున తలపడే జట్ల ఎంపిక బుధవారం సాయంత్రం 4గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన 14 ఏళ్ల లోపు వయసు గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని తెలిపారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన వారు మాత్రమే హాజరు కావాలని కోరారు. వివరాలకు 94900 73414 నంబరులో సంప్రదించాలని సూచించారు.

శిక్షణతో బోధనాభ్యసన సామర్థ్యాలు వృద్ధి



బోధనాభ్యసన సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈవో రమణ

పద్మనాభం: జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధనాభ్యసన సామర్థ్యాలు పెంపొందుతాయని ఎంఈవో పొన్నగంటి రమణ అన్నారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా విద్యాలయంలో ఆరు రోజులుగా జరిగిన జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశంలో రమణ మాట్లాడారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలు పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టవంతం చేసేందుకు దోహద పడతాయన్నారు. 120 రోజులు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ కోర్సు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ముందుగా ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన టీఎల్‌ఎంను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు ఎస్.పద్దరాజు, ఎ.ఆదిబాబు, ఎ.ఈశ్వరరావు, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

శివపూజకు వేళాయె..

మహా శివరాత్రి వేడుకలకు ఆలయాలు సిద్ధం

తగరపువలస: మహా శివరాత్రి వేడుకలకు భీమిలి పరిధిలో ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆలయాలతో పాటు పరిసరాలను శుభ్రం చేసి మామిడి, కొబ్బరి తోరణాలు, అరటిచెట్లు కట్టారు. విద్యుద్దీపకాంతులతో ఆలయ పరిసరాలు వెలుగు లీనుతున్నాయి. బుధవారం వేకువ జామునుంచే భక్తులకు మహాదేవుని దర్శనం కల్పించనున్నారు. ఇప్పటికే పలు శివాలయాలలో భైతోభజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. జాగరణ చేసేందుకు గాను పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



విద్యుద్దీపకాంతుల్లో టి.నగరపాలెం శివాలయం

గెద్దపేటలో..

పద్మనాభం: మండలంలోని పలు శివాలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. పద్మనాభం, తునివలస, కురపల్లి, గంధవరం, బి.ఆర్.తాళ్లవలస, గెద్దపేట, విలాస్కాన్‌పాలెం, అన్నవరంలోని దారకొండపై వెలసిన శివాలయాలను ముస్తాబు చేశారు. శివాలయాల వద్ద లైటింగ్ ఏర్పాటు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంక్ లక్ష్యం

జీవీఎంసీ ఏడీసీ సోమన్నారాయణ



మాట్లాడుతున్న ఏడీసీ సోమన్నారాయణ

మధురవాడ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడం పౌరులందరి బాధ్యత అని జీవీఎంసీ ఏడీసీ సోమన్నారాయణ అన్నారు. జోన్-2 పరిధిలోని సచివాలయ కార్యదర్శులు, ఆర్‌పీలు, వివిధ విభాగాలు అధికారులు, సిబ్బందితో పీఎం పాలెం వీ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మన నగరం 4వ స్థానంలో ఉందని, మరింత మెరుగైన స్థానంలో నిలపాలని కోరారు. నగరంలో పౌరులకు అందుతున్న సదుపాయాలు, సేవలు, ప్లాస్టిక్ నిషేధం, పరిశుభ్రత, టాయిలెట్స్ వినియోగం తదితర అంశాలపై ప్రజలు మంచి ర్యాంకింగ్ ఇవ్వడం ద్వారా నగరాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానంలో నిలపవచ్చన్నారు. ప్రస్తుతం ఫీడ్‌బ్యాక్‌లో మధురవాడ జోన్ ప్రథమ స్థానంలో ఉందని, ఇంకా 10రోజులు సమయం మాత్రమే ఉందని తెలిపారు. ప్రతి రోజు 30వేలకు తగ్గకుండా ఫీడ్ ఇచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కిషోర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, ఇన్‌చార్జి జెడ్సీ కనక మహాలక్ష్మి, ఏపీడీ శ్రీరాం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు సాయి రవీంద్ర పాఠశాల విద్యార్థులు స్కూల్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ముందుగా స్కూల్ కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ ఆధ్వర్యంలో సైన్స్, గణిత రంగాలలో విశేష సేవలు అందించిన శాస్త్రవేత్తలకు ఘనంగా నివాళులు అర్పించారు. విద్యార్థులు 200 వరకు నమూనాలను ప్రదర్శించారు. వీటిలో చంద్రయాన్, శాటిలైట్ కమ్యూనికేషన్, హైడ్రాలిక్ పవర్ వంతెన, డ్రిప్ ఇరిగేషన్, సోలార్ సిస్టమ్ తదితర నమూనాలు ఉన్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పతకాలు అందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చంద్రయాన్ నమూనా ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాండ్రంగిలో వ్యక్తి అదృశ్యం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో ఒక వ్యక్తి కనిపించడం లేదంటూ ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. పాండ్రంగి గ్రామానికి చెందిన స్వయంవరపు వీరరాజు(45) ఎనిమిది నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇంతవరకు ఇంటికి రాలేదు. గతంలో కూడా అనేక సార్లు వీరరాజు ఇంటి నుంచి వెళ్లిపోయి, కొన్ని రోజుల తరవాత మళ్లీ ఇంటికి వచ్చేసేవాడు. ఈ సారి మాత్రం ఎనిమిది నెలలు దాటిపోతున్నా తిరిగి రాకపోవడంతో వీరరాజు భార్య సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



వీరరాజు (ఫైల్)

అలరించిన భరతనాట్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన ఇస్తున్న లక్ష్మి పార్థసారథి ఆత్రేయ

కొమ్మాది: బీచ్‌రోడ్డులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. యువతలో భారతదేశ శాస్త్రీయ సంగీతం, నృత్య కళలపై ఆసక్తి కలిగేలా ఏర్పాటైన స్పిక్‌మేకే (సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ ఎమాంగెస్ట్ యూత్) ఆధ్వర్యంలో ప్రముఖ భరతనాట్య కళాకారిణి లక్ష్మి పార్థసారథి ఆత్రేయ నృత్య ప్రదర్శన ఇచ్చారు. భక్త కన్నప్ప, భక్త మార్కండేయుల భక్తికి మెచ్చి శివుడు ప్రత్యక్షమై రక్షించడం మొదలైన ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో గీతం విద్యార్థి విభాగం డీన్ డాక్టర్ బాలకుమార్, గీతం ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ విభాగ అధిపతి డాక్టర్ ఆముక్తమాల్యద పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

పద్మనాభం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు గురువారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 85 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 70 మంది పురుష ఉపాధ్యాయులు, 15 మంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. పద్మనాభం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఒక పీవో, ఒక ఏపీవో, ఇద్దరు వోపీలను నియమించారు.

పార్కు పరిరక్షణ అందరి బాధ్యత



పార్కులో సందర్శకులు, వాకర్స్‌తో మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ

మధురవాడ: విశాలమైన పార్కును పరిరక్షించుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందని పీఎం పాలెం సీఐ జి.బాలకృష్ణ అన్నారు. స్వతంత్రనగర్ పార్కును మంగళవారం సాయంత్రం సందర్శించిన ఆయన అక్కడి పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో వ్యాయామం అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సునీత, పార్కు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

26 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో భీమిలి క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 26 కిలోల గంజాయిని ఆనందపురం లా అండ్ ఆర్డర్ ఎస్ఐ శివ, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం ప్రకారం క్రాస్‌రోడ్డు వద్ద మాటు వేసి వాహనాలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో అరకు తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచి నగరంలోని మారికవలసకు చెందిన శోభ భీమన్న(28), హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన శ్రావణ్ రామ్ గొండి(60), అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కుండిబ గ్రామానికి చెందిన గుజ్జుల రాంబాబు(33) గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిని ఆనందపురం సీఐ వాసునాయుడు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయిని, ఆటోలను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళన వీడితే విజయం తథ్యం

• ఏయూ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ నాగరాజకుమారి
• గురుకుల విద్యార్థులకు అవగాహన సదస్సు



మధురవాడ: విద్యార్థులు ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో చదివితే పరీక్ష బాగా రాయగలరని ఆంధ్రా యూనివర్సిటీ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య డి.నాగరాజకుమారి అన్నారు. కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలిక సీవోఈలో ఒత్తిడి లేకుండా పరీక్ష రాసే విధానంపై 'బ్రెయిన్ బూస్ట్' పేరుతో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ధ్యానం, తేలికపాటి వ్యాయామం వంటి పద్ధతుల ద్వారా ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. లక్ష్యంపై దృష్టి సారించి చదవాలన్నారు. పరీక్ష అంటే భయం, ఆందోళన వంటివి విడనాడాలని సూచించారు. అవసరమైన విషయాలు ఉపాధ్యాయుల ద్వారా ఒకటికి రెండుసార్లు తర్ఫీదు పొందాలని, చదివిన వాటిలో ముఖ్యమైనవి రాస్తే మరింత బాగా గుర్తు ఉంటాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డి.శాంతకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు బి.కిషోర్‌బాబు, పలువురు గురుకుల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచితంగా చికెన్, ఎగ్ వంటకాల పంపిణీ

తగరపువలస: బర్డ్ ఫ్లూ వైరస్ పేరుతో చికెన్‌కు దూరంగా ఉంటున్న ప్రజలకు అవగాహన కల్పించేందుకు వెన్‌కాబ్ చికెన్, నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో మంగళవారం సాయంత్రం చికెన్, ఎగ్ వంటకాల వెరైటీలు ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక చికెన్, ఎగ్ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు కూడా పాల్గొన్న ఈ కార్యక్రమంలో చిల్లీ చికెన్, చికెన్ 65, బాయిల్డ్ ఎగ్ అందజేశారు. ఈ ప్రాంతంలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని, నిర్భయంగా చికెన్, ఎగ్ తినవచ్చని ఈ సందర్భంగా స్థానికులకు తెలియజేశారు. వీటిని తినడానికి ఈ ప్రాంతవాసులు ఆసక్తి కనబరచి, క్యూ లైన్లలో పోటెత్తారు.



అంబేడ్కర్ కూడలిలో పంపిణీ చేస్తున్న చికెన్, ఎగ్ వంటకాలు

రాజ్యాంగానికి కూటమి ప్రభుత్వం తూట్లు



మాట్లాడుతున్న హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చిట్టివలసలో మాట్లాడారు. అధికారం చేపట్టిన 9 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు మొండి చేయి చూపించిందన్నారు. చంద్రబాబు, లోకేష్‌ల రాజ్యాంగం మాత్రమే నడుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే మహిళలకు భద్రత లేదని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు ఆశ కల్పించి రోడ్డుమీదకు ఈడ్చారన్నారు. వైఎస్సార్ సీపీకి సమాధానం చెప్పే ధైర్యం లేకనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలే ప్రారంభంగా కూటమి ప్రభుత్వ పతనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

పల్సస్ ఉద్యోగులకు తక్షణమే జీతాలివ్వాలి

మధురవాడ: విశాఖ ఐటీ సెజ్‌లోని పల్సస్ హెల్త్ టెక్ సంస్థలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులకు బకాయిపడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. నైపుణ్యం గల ఉద్యోగులను అతి తక్కువ జీతాలతో పనిచేయించుకుంటూ ప్రతి నెలా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీలు పొందుతున్న యాజమాన్యం ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేయించుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల జీతాల్లో కోతలు ఆపి, పీఎఫ్ సక్రమంగా చెల్లించాలని, బకాయి పడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగుల తరపున పోరాడతామని తెలియజేశారు.